క్లుప్తంగా

మైసమ్మకు ప్రత్యేక పూజలు



మైసమ్మ సన్నిధిలో సీఐ శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

కడ్తాల్: మండల పరిధి ఎక్వాయిపల్లి గ్రామ సమీపంలోని పులికొండ మైసమ్మ తల్లికి శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా ఈ ప్రాంతంలో ఆలయం ప్రసిద్ధి. అమ్మవారిని సాధారణ భక్తులతో పాటు ఇంటలిజెన్స్ సీఐ శ్రీకాంత్‌గౌడ్, న్యాయవాది బద్రిపల్లి మధు తదితరులు దర్శించుకుని పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అధికారి సురేశ్, నాయకులు చంద్రయ్య, గంటి శ్రీనయ్య తదితరులు ఉన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు హైమాస్ట్ లైట్లను గురువారం రాత్రి కాంగ్రెస్ నాయకుడు వెంకటేశ్ ప్రారంభించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నిధుల నుంచి హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'మీ పిల్లలను సర్కారు బడిలో చేర్పించండి'



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం ఉదయశ్రీ

యాచారం: మెరుగైన విద్యాబోధన, ఉచితంగా భోజనం, పుస్తకాలు, యూనిఫామ్స్ అందించే ప్రభుత్వ పాఠశాలల్లో మీ పిల్లలను చేర్పించాలని నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉదయశ్రీ సూచించారు. శుక్రవారం గ్రామంలో డ్వాక్రా సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు, సరైన విద్యాబోధన ఉండదని, చిన్నారులను సర్కారు బడుల్లో చేర్పించాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక



నూతన సభ్యులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ఉద్యమించేందుకు పలు సంఘాలు ఏకమై శుక్రవారం నూతన జేఏసీని ప్రకటించాయి. టీఎంయూ, టీజేఎంయూ, ఎస్‌డబ్ల్యూయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్, బీకేయూ సంఘాలు కలిసి ఐక్య కార్యాచరణ కమిటీగా ఏర్పడ్డాయి. డిపో జేఏసీ కన్వీనర్‌గా వి.శ్రీనివాస్, కో- కన్వీనర్లుగా పి.జంగయ్య, ఎండీ రజాక్, సిరాజ్, పి.సత్తయ్య, కోశాధికారిగా ఎం.మల్లేశ్, ప్రచార కన్వీనర్‌గా జి.సురేశ్, సభ్యులుగా బి.శ్రీశైలం, సీహెచ్.యాదయ్య, సీహెచ్.పరమేశ్, బి.దర్శన్, ఎం.నర్సింహ్మ, కె.ప్రవీణ్, రవీందర్‌లను నియమించారు.

స్వయం కృషితో ఆర్థిక ప్రగతి



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కోఆర్డినేటర్ అంజలిదేవి

యాచారం: స్వయం కృషితో ఆర్థిక ప్రగతి సాధించాలని జన శిక్షణ సంస్థాన్ జిల్లా ఫీల్డ్ కోఆర్డినేటర్ అంజలిదేవి అన్నారు. సంస్థాన్ ఆధ్వర్యంలో మండల పరిధి మాల్ గ్రామంలో మూడు నెలలుగా టైలరింగ్, ఎంబ్రాయిడింగ్‌లో మహిళలకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తిచేసుకున్న 80 మందికి శుక్రవారం ఆమె సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం అంజలి మాట్లాడుతూ.. శిక్షణ సమయంలో గ్రామస్తులు బట్టు శ్రీనివాస్ సహకరించారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిన్నోళ్ల పద్మజ తదితరులు పాల్గొన్నారు.

వెంటాడుతున్న భయం



రెడ్డికుంట చెరువు కట్టకు అడ్డుగా మట్టిబస్తాలు

ఆందోళనలో ముంపు ప్రాంతాల ప్రజలు

- మేలుకోని ఇరిగేషన్ శాఖ
- చెరువులకు శాశ్వత మరమ్మతులు మరచిన అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్: వరద ముప్పు వెంటాడుతోంది. భారీ వర్షాల కారణంగా నాలుగేళ్ల క్రితం చెరువులు, కుంటలకు గండ్లు పడి పంటలు, పలు ప్రాంతాలు నీట మునిగి అపార నష్టం జరిగింది. అయినప్పటికీ.. చెరువులకు మరమ్మతులు చేపట్టడంలో ఇరిగేషన్ అధికారులు విఫలమయ్యారు. తాత్కాలిక పనులు చేపట్టి చేతులు దులుపుకొన్నారు. ప్రస్తుతం వానాకాలం సమీపస్తుండటంతో మరోసారి నష్టం చవిచూడాల్సి వస్తుందేమోనని ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు.

పట్టించుకోని అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కేంద్రంలోని రెడ్డికుంట చెరువు, పెద్దఅంబర్‌పేట ఈదులచెరువు, బాటసింగారం బాత్కులచెరువు, కొత్తగూడెం చెరువు, లష్కర్‌గూడ కత్వలు నాలుగేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా గండ్లు పడ్డాయి. వరదల కారణంగా పంట పొలాలు దెబ్బతిన్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. దీంతో నాడు అప్రమత్తమైన ఇరిగేషన్ శాఖ తాత్కాలిక మరమ్మతు పనులతో సరిపెట్టుకుంది.

శాశ్వత మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆయా చెరువులు, కుంటల కింద సాగుచేసుకునే రైతులు, ముంపు గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వర్షాకాలం సమీపిస్తుండటంతో మరోసారి మునగాల్సి వస్తుందేమోనని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వాటికి మరమ్మతు పనులు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని బాధిత ప్రాంతాల ప్రజలు, రైతులు ఆరోపిస్తున్నారు.

మట్టి బస్తాలతో అడ్డుకట్ట

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కేంద్రంలోని రెడ్డికుంట చెరువు కట్ట పూర్తిగా తెగిపోయింది. కేవలం మట్టి బస్తాలతో అడ్డుకట్ట వేసి చేతులు దులుపుకొన్న ఇరిగేషన్ అధికారులు తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. నాడు ఈ చెరువు కట్ట తెగి, విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వర్షాకాలం సమీపిస్తుండటంతో ప్రమాదకరంగా ఉన్న చెరువులు, కుంటలపై ఇరిగేషన్ అధికారులు దృష్టిని సారించాలని, నష్టం జరగముందే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

సేవలతోనే సమాజంలో గుర్తింపు



అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ గీత తదితరులు

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీత

కడ్తాల్: సేవలతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తాయని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో దివంగత గూడూరు పుష్పమ్మ- నారాయణరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో లయన్స్‌క్లబ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాగి అంబలి కేంద్రాన్ని క్లబ్ డిస్ట్రిక్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీఓ సుజాతలతో కలిసి శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెద్దల జ్ఞాపకార్థం అంబలి కేంద్రం ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని నిర్వాహకులను అభినందించారు. లయన్స్‌క్లబ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షులుడు బిచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, సేవాదళ్ అధ్యక్షుడు లక్ష్మయ్య, మార్కెట్ డైరెక్టర్ నరేశ్, నాయకులు రాజేశ్, జహంగీర్ అలీ, మల్లేశ్‌గౌడ్, షాబుద్దీన్, ఇమ్రాన్‌బాబా, భానుకిరణ్, శ్రీకాంత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పథకం నిర్వీర్యానికి కుట్ర



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

- 30న చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయండి
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య

మాడ్గుల: ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య ఆరోపించారు. శుక్రవారం మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైతాంగ, వ్యవసాయ కూలీల జీవితాలను ఆగం చేసేందుకు కంకణం కట్టుకుందని విమర్శించారు. వ్యవసాయానికి వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలు తెచ్చిందని, పోరాడి సాధించుకున్న ఉపాధి చట్టాన్ని కాలరాసేందుకు యత్నిస్తుందన్నారు. ప్రతి బడ్జెట్‌లోనూ నిధుల కోత విధించి, క్రమంగా ఉపాధి పథకాన్ని కనుమరుగు చేసేందుకు యత్నిస్తుందని పేర్కొన్నారు. ఇటీవల కేంద్రం.. ఉపాధి కూలీలకు రూ.307 చెల్లించాలని చట్టం చేసిందని, కానీ గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా రూ.200 మాత్రమే చెల్లిస్తుందని వివరించారు. ప్రతి పనికి రూ.350లు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని, కొలతలతో సంబంధం లేకుండా రూ.700 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో కూలీలకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, పనిముట్లు, మెడికల్ కిట్లు తదితర సౌకర్యాలను కల్పించాలని కోరారు. కార్మికుల సంక్షేమ కోసం ఈ నెల 30న కలెక్టరేట్‌లో చేపట్టే మహా ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ సంఘం కార్యదర్శి పాషా, నాయకులు బుచ్చయ్య, సంధ్య, వెంకటమ్మ, కృష్ణమ్మ, పాపమ్మ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో జాప్యం తగదు

త్వరగా కొనుగోలు చేయాలి: చైర్‌పర్సన్



మార్కెట్‌యార్డులో ధాన్యం పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ గీత

ఆమనగల్లు: ధాన్యం కొనుగోలులో ఆలస్యం తగదని, వెంటనే సేకరించి రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత నిర్వాహకులకు సూచించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో తలకొండపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ధాన్యం విక్రయించేందుకు తెచ్చిన అన్నదాతలతో మాట్లాడగా.. అదనంగా హమాలీలను నియమించి వడ్లను త్వరగా కొనుగోలు చేయాలని ఆమెకు విన్నవించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం తగదని, ప్రక్రియలో వేగం పెంచాలన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ధాన్యం తడిచినా చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా మార్కెట్లో ఏర్పాటు చేసిన ఉచిత భోజన వసతిని ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరి భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ఆమనగల్లు అధ్యక్షుడు నర్సింహ, పార్టీ కడ్తాల్ మండలం అధ్యక్షుడు బిచ్యానాయక్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు హన్మానాయక్, కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, మార్కెట్‌కమిటీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, నాయకులు మల్లేశ్, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తప్పనిసరి



ఇబ్రహీంపట్నంలో ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి
- అవగాహన ర్యాలీలో వైద్యాధికారులు
- ఘనంగా డెంగీ నివారణ దినోత్సవం

ఇబ్రహీంపట్నం/ ఆమనగల్లు: డెంగీకి కారణమైన దోమలు నిల్వ నీటి నుంచే పుట్టుకొస్తాయని, పరిసరాల పరిశుభ్రతను పాటించి, దోమల నివారణకు చర్యలు చేపడితే ప్రాణాంతక వ్యాధులు దరిచేరవని ఇబ్రహీంపట్నం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధా మాధవి, పీపీ యూనిట్ వైద్యురాలు సరితలు అన్నారు. డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఇబ్రహీంపట్నంలో ప్రభుత్వ వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నీటిలో దోమలు గుడ్లు పెడతాయని, పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని చెప్పారు. పూల కుండీలు, పాత్రల్లో నీటిని ఎప్పటికప్పుడు ఖాళీ చేసి, శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే-డ్రైడేగా పాటించి, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎం.హేమ్‌లాల్, విజేందర్, ఏఎన్‌ఎం మేరి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆమనగల్లులో.. అవగాహన ర్యాలీ

ఆమనగల్లులో..

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని డాక్టర్ మంజుల అన్నారు. పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆమనగల్లు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. నివాసాల మధ్య మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, జ్వరం వస్తే వెంటనే చికిత్స చేయించుకోవాలని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది రచనాసింగ్, నాగేశ్వరీ, ఎసుమణి, హెబ్సిబా, దేవేందర్, ఇందిర, సీత, మాధవి, విజయ్‌కుమార్, శ్రీను పాల్గొన్నారు.

పంట మారుద్దాం..



ఆమనగల్లు: సంకటోనిపల్లి రైతు సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

భూసారం కాపాడుకుందాం

- బిందు, తుంపర సేద్యంపై దృష్టి సారించాలి
- సుస్థిర పద్ధతులతో ప్రయోజనాలు
- ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు

ఆమనగల్లు/కడ్తాల్: మానవ ఆరోగ్యానికి, నేల సంరక్షణకు అంతర పంటల సాగుతో పాటు, పంటల మార్పిడి చేపట్టాలని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు డాక్టర్ అనిత, డాక్టర్ సుప్రజ, డాక్టర్ విద్యాసాగర్, శిరీషాదీప్తి, సాహితిలు అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కడ్తాల్ మండలం న్యామతాపూర్, నాగిరెడ్డిగూడ తండాల్లో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ హిత వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. రసాయన ఎరువులు వాడటం వలన భూమి ఫలదాయకత తగ్గిపోతుందని, అలాంటి పరిస్థితులను అధిగమించేందుకు వర్మి కంపోస్ట్, పచ్చిరొట్ట ఎరువులు వాడటం ఉత్తమమని పేర్కొన్నారు. నీటి ఎద్దడి పెరుగుతుండటంతో.. బిందు, తుంపర సేద్యంపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. ఎరువులు, విత్తనాల కొనుగోలు రశీదులను భద్రపరుచుకోవాలని, తద్వారా ఆపత్కాలంలో సరైన పరిహారం పొందవచ్చునన్నారు. అదే విధంగా సుస్థిర వ్యవసాయ పద్ధతులు, సాగులోని మెలకువలు, నీటి యాజమాన్యం, భూసారం పెంపు, రసాయన ఎరువుల వాడకం తగ్గించడం, సాగు ఖర్చులు తగ్గించడం, పంట మార్పిడి, పర్యావరణ రక్షణ తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీలత, ఏఈఓలు అభినవ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కశ్యప్, అనూష, బాలునాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర పద్ధతులతో ప్రయోజనాలు

ఆమనగల్లు: సుస్థిర వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులు అనేక ప్రయోజనాలు పొందవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ నిర్మల, డాక్టర్ సుజాతలు అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి సంకటోనిపల్లి గ్రామంలో శుక్రవారం విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు.. రానున్న వర్షాకాలంలో సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వేసవి దుక్కులు, విత్తనాలు నాటడం, సహజ ఎరువులు వేయడం, సేంద్రియ సాగు విధానంపై అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని నియంత్రించాలని, జీవన ఎరువులు, సేంద్రియ పద్ధతులతో వ్యవసాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అరుణకుమారి, మాజీ ఎంపీపీ ధనుంజయ, రైతులు అనంతరాములు, శ్రీపాల్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పంటలను సాగు చేయాలి

తుర్కయంజాల్: రైతులు సంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటలను సాగు చేయాలని రైతు సంక్షేమ సంఘం సభ్యుడు ఎస్.రాములు నాయక్ అన్నారు. శుక్రవారం పురపాలక సంఘం పరిధి కొహెడలో నిర్వహించిన 'రైతు ముంగిట శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. డాక్టర్ ఎం.సుజాత (మొక్క జొన్న పరిశోధన కేంద్రం, ప్రధాన శాస్త్రవేత్త), డాక్టర్ రాజశేఖర్(కీటక శాస్త్రవేత్త)లు మాట్లాడుతూ.. తక్కువ మొత్తంలో యూరియా, పురుగు మందులను ఉపయోగించాలని సూచించారు. అధిక మొత్తంలో వాడటం వలన భూముల సారం దెబ్బతినడంతో పాటు, వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని పేర్కొన్నారు. సమర్థ నీటి వినియోగం, అటవీ వ్యవసాయం, విత్తన, నేల శుద్ధి, పంట మార్పిడి పద్ధతులను అవలంభించాలని చెప్పారు. విత్తనాలు, ఎరువులు ఇలా ఏది కొనుగోలు చేసినా రశీదులను భద్రపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పల్లవి, సాగు విస్తరణ అధికారి రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: రైతులకు సలహాలు, సూచనలు చేస్తున్న శాస్త్ర వేత్తలు



తుర్కయంజాల్: సమావేశంలో మాట్లాడుతున్న రాములు నాయక్

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: ముఖ్యమంత్రి సహాయనిధి పథకంతో పేదలకు మేలు చేకూరుతోందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం ఆయన పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ.. అర్హులంతా సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చెక్కులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుకు ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

దుకాణం.. కొనసాగిస్తే ఆదాయం

వృథాగా ఎస్సీ కమ్యూనిటీ సహకార మడిగలు



మండల కేంద్రంలో నిరుపయోగంగా ఎస్సీ కమ్యూనిటీ దుకాణ సముదాయం

యాచారం: వినియోగంలో లేక శిథిలావస్థకు చేరుకుంటున్న ఎస్సీ కమ్యూనిటీ సహకార దుకాణ సముదాయాన్ని వినియోగంలోకి తేవాలని ఆ వర్గ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. యాచారం మండల కేంద్రం నాగార్జునసాగర్- హైదరాబాద్ రహదారిపై 25 ఏళ్ల క్రితం షెడ్యూల్ కులాల నిరుద్యోగ యువత ఉపాధి పొంది, ఆర్థికంగా బలపడాలని ప్రభుత్వం రూ.2.50 లక్షలు వెచ్చించి మడిగలు నిర్మించింది. కానీ ఆ సముదాయం నాటి నుంచి ఉపయోగంలో లేక!.. శిథిలావస్థకు చేరుకుంది.

పట్టించుకోని పాలకులు

శిథిలావస్థలో ఉన్న ఆ దుకాణాలకు మరమ్మతు చేసి, లీజుకు ఇవ్వాలని ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించామని, అయినా పట్టించుకోవడం లేదని ఆ వర్గ ప్రజలు ఆరోపిస్తున్నారు. వాణిజ్య భవనం పక్కనే యాచారం పీఏసీఎస్, ప్రభుత్వ ఆస్పత్రి, విద్యుత్ కార్యాలయాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. వ్యాపార పరంగా మండల కేంద్రం దినదినాభివద్ధి చెందుతోందని, నిత్యం జనసంచారంతో ఉన్న ప్రాంతంలో మడిగెలను వినియోగంలోకి తెస్తే బాగుంటుందని, ప్రభుత్వానికి కిరాయి రూపేణా ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి, మడిగెలను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

వ్యసనాలతో భవిష్యత్తు అంధకారం

- జైలు పాలైతే.. ఉద్యోగాలు రావు
- హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు



నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ కృష్ణంరాజు

యాచారం: చేడు మార్గాలను ఎంచుకుంటే భవిష్యత్తు అంధకారమవుతుందని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు అన్నారు. మద్యం, జూదం, కొట్లాటల జోలికి పోరాదని సూచించారు. నక్కర్తమేడిపల్లి గ్రామంలో శుక్రవారం సైబర్ నేరాలు, డ్రగ్స్, ఆస్తులను ధ్వంసం చేయడం, ట్రాఫిక్‌రూల్స్‌పై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత వ్యసనాలకు బానిస కావద్దని, ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదై, జైలు పాలవుతారని హెచ్చరించారు. భవిష్యత్తులో ఉద్యోగాలు రాకుండా పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయి వాడటం నేరమని, చట్టాలను అతిక్రమిస్తే జీవితం మొత్తం కేసులే వెంటాడతాయని పేర్కొన్నారు. రోడ్డుపై వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. కొత్త వ్యక్తుల సంచారంపై నిఘా పెట్టి, పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మహిళలపై దాడులు, గొలుసు దొంగతనాలు జరుగుతున్నాయని, స్త్రీలు జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్ఐ తేజంరెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, మాజీ సర్పంచ్ బోడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.